## కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలనా





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


### హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా
## ఇర్సడ్ల సదానందం నియామకం





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 110 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 17 ఏప్రిల్ 2026


# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

● ఇందులో ఎలాంటి రాజకీయం లేదు ● 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు ● వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత ● చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం ● ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు ● ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది ● దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు ● ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు ● డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు ● మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు మిగతా2లో...

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● బొలెరోను ఢీకొన్న రెడీమిక్స్ వాహనం

● ప్రమాదంలో 8మంది మృతి..పలువురికి గాయాలు


● మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు



**కర్నూలు,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే మిగతా2లో...

# దేశవ్యాప్తంగా మండుటెండలు

- అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగా లంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతా2లో...

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

● ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

● ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్

● అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి


● అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమ య్యారు. యంగ్ ఇండియా స్కిల్ మిగతా2లో...

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ జూన్ 6కు వాయిదా



**హైదరాబాద్,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మిగతా2లో...

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు




# తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల

డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి

దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై మిగతా2లో...

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు

మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. మిగతా2లో...



# రాజ్యసభ సభ్యులుగా సింఘ్వీ, వేం ప్రమాణం


**హైదరాబాద్,ఏప్రిల్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి గురువారం పార్లమెంట్ భవనంలో రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి వాణి వినిపిస్తానని చెప్పారు. నరేందర్‌రెడ్డికి మంత్రులు సీతక్క, శ్రీహరి అభినందనలు తెలిపారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే

దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా

జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



**హైదరాబాద్,ఏప్రిల్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి మిగతా2లో...

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి సబ్జెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు సబ్జెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ది పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదఅని రామచందర్ రావు అన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్‌సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా మండుటెండలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పు లు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వా డా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిం చింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజరుకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజరు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేక పోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

(మొదటి పేజీ తరువాయి)

పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో రీడింగ్ ఫెస్టివల్

**పరకాల,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రీడింగ్ ఫెస్టివల్ మరియు పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్ పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తూ పుస్తక పఠనం అనేది నిత్యజీవితంలో భాగం కావాలని నిరంతర పుస్తక పఠనం వలన మేధోశక్తి మరియు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, సమాజంలోని వివిధ అంశాల పట్ల అవగాహన పెరుగుతుందని, ప్రయాణంలో ప్రతి ఒక్కరూ ఒక పుస్తకాన్ని చదవటం అలవాటు చేసుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి పేర్కొన్నారు. గ్రంథాలయ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ రాజేశ్వర్ కుమార్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో మీకు ఇష్టమైన అంశంపై ఏదో ఒక పుస్తకాన్ని ఎంచుకొని ప్రతినిత్యం కనీసం 10-15 నిమిషాలైనా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని,



ప్రతి పుస్తకం ఒక మంచి స్నేహితుడిని పరిచయం చేస్తుందని, పుస్తకాలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను, పోటీ పరీక్షలకు ఉపయోగకరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అధ్యాపక బృందము మరియు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలనా

• ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనంగా పుస్తక ప్రదర్శన





**హనుమకొండ ,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు గ్రంథాలయ విభాగం అధ్వర్యంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి డాక్టర్ నరిశెట్టి భారత్ తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ శ్రీనివాస్ గారు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన వలన విద్యార్థులక్ను నము, పఠనాసక్తి, క్రమశిక్షణ తో పాటు పుస్తకాల పట్ల అవగాహన కలిగి సమాజ సేవలో పాల్గొనడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి తోడ్పడిన వారవుతారని ఉద్బోధించారు.ఈ పుస్తక ప్రదర్శనలో పోటీ పరీక్షలకు, వ్యక్తి వికాసానికి, ప్రేరణకు ఉపయోగ పడే వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శించినట్లు గ్రంథాలయాధికారి డాక్టర్ భారత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫైర్ స్టేషన్ పరకాల ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు

# ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం

**పరకాల,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఫైర్ స్టేషన్ పరకాల ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 1944 ఏప్రిల్ 14న ముంబై నౌకాశ్రయంలో జరిగిన భయానక అగ్ని ప్రమాదంలో వీరమరణం పొందిన 66 మంది అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది.ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వి. భద్రయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన సదస్సులు, మాక్ డ్రిల్స్



నిర్వహిస్తూ విద్యుత్ భద్రత, ఎల్పీజీ వినియోగం, గ్యాస్ లీకేజీ నివారణ, అగ్ని ప్రమాద సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరంగా సూచనలు అందిస్తున్నామని చెప్పారు.ఏప్రిల్ 14 నుండి 20 వరకు జరుగుతున్న ఫైర్ సర్వీస్ వీక్ వారోత్సవాలలో భాగంగా గురువారం పరకాల పట్టణంలోని సగర వీధి కాలనీలో కరపత్రాల పంపిణీ చేసి, గోడలకు పోస్టర్లు అంటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇండ్లలో జరిగే గ్యాస్ ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్ సమయంలో ఎలా స్పందించాలో వివరించారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వి. భద్రయ్య, ఎల్ఎఫ్ఎఫ్ పి. కృష్ణ కుమార్, జి. గణేష్ (ఎఫ్ఎఫ్టి), సిహెచ్. దిలీప్ (ఎఫ్ఎఫ్), డి. రాజేంద్రప్రసాద్ (ఎఫ్ఎఫ్) పాల్గొన్నారు.

# ఘనంగా వరల్డ్ ఆర్ట్ డే సెలబ్రేషన్స్...



**జమ్మికుంట, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**జమ్మికుంట ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ ఆర్ట్ డే ను బుధవారం సాయంత్రం జమ్మికుంట పట్టణంలోని రఘు ఆర్ట్ గ్యాలరీలో జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ గౌడ్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటికి కనిపించే అందాలన్నీ కుంచతో రంగులు అందమైన చిత్రాలకు రూపం దాల్చేవారే ఆర్టిస్టులను అభివర్ణించారు.సంగీతం, గానం , ఎన్నో కలలు ప్రజలను ఆనందింప చేస్తాయని అన్నారు. అదేవిధంగా సీనియర్ ఆర్టిస్ట్ శిల్పా భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచంలో లియోనార్డ్ డావిన్సీ అనే గొప్ప కళాకారుడు మోనాలిసా చిత్రాన్ని అద్భుతంగా గీసి అత్యంత విలువైన పెయింటింగ్ గుర్తింపు వచ్చిందన్నారు. లియోనా డావెన్సీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 15న ప్రపంచ కళా దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు భువనేశ్వర్ (శ్రీరామ్ ఆర్ట్స్), సీనియర్ ఆర్టిస్టులు వీరస్వామి (సిటీ ఆర్ట్స్) ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు ఆర్ట్స్ ) బ్రహ్మం (బ్రహ్మాస్) సంతోష్ (సంతు ఆర్ట్స్) సాయినాథ్ (మెర్సీ ఆర్ట్స్) కమల్ విశ్వ (కమల్) ఆర్ట్స్ , సంపత్ చందు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారి

**రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి: అడిషనల్ ఎస్పీ సదానందం**

**ములుగు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల సురక్షిత ప్రయాణం లక్ష్యంగా ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "Arrive Alive" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారుల కోసం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు.ములుగు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు మరియు ఇతర వాహనదారులు పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు ఉన్న వారికి తగిన సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు మరియు మందులు పంపిణీ



చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సదానందం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు ఎలా జరుగుతాయో ముందుగా అంచనా వేయలేమని, అందుకే నివారణ చర్యలు అత్యంత ముఖ్యమని తెలిపారు. చిన్న చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయని, అలాంటి ఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.సుదూర ప్రయాణాలు చేసే



లారీ, బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. స్పష్టమైన చూపు లేకపోతే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలు మరియు ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశముందని తెలిపారు. అందువల్ల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం తో పాటు డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. సురేష్, ఎస్సైలు ఉపేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా

# ఇర్సడ్ల సదానందం నియామకం





**ఆత్మకూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇర్సడ్ల సదానందం అబ నియమించిన స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, జిల్లా అధ్యక్షులు పొడి శెట్టి గణేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ బాధ్యతను నాకు అప్పగించడం పట్ల గౌరవంగా భావిస్తూ, ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇస్తున్నాను.తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కాపాడటమే నా ప్రాధాన్య లక్ష్యం. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసే వరకు శక్తి వంచన లేకుండా పోరాటం కొనసాగిస్తాను. ప్రతి ఉద్యమకారుడి సమస్యను వినిపిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తాను.ఉద్యమకారుల ఐక్యతే మన బలం. అందరి సహకారంతో ఫోరాన్ని మరింత బలోపేతం చేసి, ఉద్యమకారుల గౌరవాన్ని నిలబెట్టేందుకు కట్టుబడి ఉంటాను.

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం





**• సంక్షేమ పథకాలపై మండల స్థాయి సమీక్ష • పథకాల అమలు పై అధికారుల వివరాలు • సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**కల్లూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరై అధికారులతో సమీక్షించారు. గురువారం రైతు వేదనంగా ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశం ఎం.పి.డి.ఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ



సంక్షేమ పథకాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నరకం వరి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల వంటి పథకాల అమలు స్థితిని సంబంధిత శాఖల అధికారులు వివరించారు. ప్రజలకు ఈ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు. అలాగే 99 రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టబోయే కొత్త కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. అల్పాహార పథకం, కుటుంబ జీవన బీమా, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనం, వికలాంగ విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, మండల ప్రత్యేక అధికారి పుష్పలత, ఎం.ఆర్.ఓ బ్రహ్మేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారిని రూప, ఎం.ఈ.ఓ ప్రత్తిపాటి నివేదిత, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చినబోయినపల్లి ఇంటర్ విద్యార్థినికి ఘన సన్మానం

**• 438 మార్కులు సాధించిన మామిడి తేజశ్రీ ప్రతిభకు ప్రశంసలు**



**చినబోయినపల్లి, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** చినబోయినపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని మామిడి తేజశ్రీ 438 మార్కులు సాధించి ప్రతిభ చాటుకుంది. ఆమె విజయాన్ని గుర్తిస్తూ ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల కార్తీక్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తేజశ్రీ సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితే ఇంకా గొప్ప విజయాలు సాధించవచ్చని ఆమెకు ప్రోత్సాహం అందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు వంగపండ్ల శరత్, రవి యాదవ్, ఎట్టి శారద పాల్గొన్నారు. అలాగే చినబోయినపల్లి సర్పంచ్ నల్లబోయిన నాగార్జున కూడా హాజరై విద్యార్థినిని అభినందించారు.గ్రామస్థులు కూడా తేజశ్రీ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# హిందూ సమ్మేళనం సన్నిహిక సమావేశం





**గంగాధర ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ఘర్షకుర్తిలో ఈ రోజున హిందూ సమ్మేళనం సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా కమిటీ గౌరవ సలహా దారుడిగాశ్రీ చిందం అంజనేయులు గర్శకుర్తి గ్రామ సర్పంచ్ , గౌరవ అధ్యక్షులు శ్రీ కల్వకోట శ్రీనివాస్ రావు , అధ్యక్షులు శ్రీ కముటం నర్సయ్య , ప్రధాన కార్యదర్శి శ్రీ పల్ల మల్లిక్, కోశాధికారి, శ్రీ స్వాతి కళ్యాణ్ రామ్ మరియు గౌరవ సభ్యులు, చిందం ఆంజనేయులు తొమ్మిది గ్రామాల ఉపాధ్యక్షులు, సహ కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులను నియమించడం జరిగింది.

# ఏటూరునాగారం మండల సభకు ఆహ్వానం

**● ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సమావేశం**



**ఏటూరునాగారం,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద, 16 ఏప్రిల్ 2026న ఏటూరునాగారం మండలంలో మండల సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయబడుతోంది. ఈ మండల సభకు గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అభ్యుదయ దారులు, ప్రజా ప్రతినిధులు మరియు ముఖ్య వ్యక్తులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రజలు కూడా ఈ సమావేశానికి హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మం కాంగ్రెస్‌లో విషాదం... మహ్మద్ జావేద్ ఆకస్మిక మృతి



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ బాయ్ దుర్మరణం పార్టీ వర్గాలను తీవ్ర విషాదంలో ముంచింది. సూర్యాపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడం అందరినీ కలచివేసింది. జావేద్ బాయ్ మరణ వార్త తెలిసిన వెంటనే ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆయన ప్రజలకు దగ్గరగా ఉండే నాయకుడిగా, పార్టీకి కట్టుబడి పనిచేసే నేతగా గుర్తింపు పొందారు. ఈ దుర్ఘటనపై జిల్లా ప్రముఖులు శెట్టి రంగారావు, నాంపల్లి శంకరయ్య, నరసింహారావు, ఉపేందర్ రెడ్డి, ఆకుల సురేష్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జావేద్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జావేద్ సేవలు కాంగ్రెస్ పార్టీకి మరువలేనివని పేర్కొన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

# మెగా రక్తదాన శిబిరం

**●రేపు శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్.అండ్.బి. గెస్ట్ హౌస్‌లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ●అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు.**



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గారి ఆదేశాల ప్రకారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్.అండ్.బి. గెస్ట్ హౌస్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధితుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో ఔత్సాహికులు, రక్త దాతలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. శనివారం ఉదయం 8.00 గంటలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్యఅతిథిలుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు పేర్కొన్నారు. గత సంవత్సరం 300 యూనిట్ల రక్త దానం చేయడం జరిగిందని, ఈ సంవత్సరం 500 యూనిట్లకు తగ్గకుండా రక్త దానాన్ని రెడ్ క్రాస్, ములుగు ప్రభుత్వ హాస్పిటల్ కి తల సేమియా పేషంట్ల కోసం, ఇతర అత్యవసర సేవలు పొందే పేషంట్ల కోసం సేకరిస్తున్నట్లు తెలియజేశారు. వేసవికాలం దృష్ట్యా రక్తం చాలా అవసరం ఉన్నందువల్ల రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఒక్కరి రక్తదానం మరో ప్రాణాన్ని కాపాడుతుందని తెలియ చేశారు. జిల్లా లోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, TNGOs, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, 5వ బెటాలియన్, సిఆర్పిఎఫ్, పోలీస్ శాఖ, యువత, ఉద్యోగస్తులు, పాత్రికేయులు రక్తదాతలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# జర్నలిస్ట్ విమర్శ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

**● మీడియా అంశంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం**

**● ప్రతి జర్నలిస్టుకు శిక్షణ అవసరం**

**● ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు టిఎస్ చక్రవర్తి**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసిన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేయడం హర్షణీయమని, జర్నలిస్ట్ చేసే విమర్శ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు టి సంతోష్ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయడానికి చేసే ప్రతి ప్రయత్నం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఇటువంటి చర్యలపై ప్రభుత్వాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ రుషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ల ధర్మాసనం విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమని స్పష్టం చేసింది. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత జర్నలిస్టును అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణను మంజూరు చేస్తూ, అభిప్రాయాలను అణిచి వేయడం సరైన విధానం కాదని తేల్చిచెప్పిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం అభిప్రాయ స్వేచ్ఛ ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని సుప్రీంకోర్టు మరోసారి గుర్తు చేసిందన్నారు. స్వేచ్ఛా మాధ్యమాలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, విమర్శలు పాలనలో లోపాలను సరిదిద్దే శక్తిగా పనిచేస్తాయని పేర్కొందన్నారు. "జర్నలిస్ట్ చేసే విమర్శ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని, వారిపై కేసులతో ఒత్తిడి తెచ్చే చర్యలు అత్యంత ప్రమాదకరం" అని ఆయన అన్నారు. జర్నలిస్టులకు లీగల్ అవగాహన పెంపు అవసరమని, ప్రతి నెల చట్టపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే మీడియా రంగం మరింత బలోపేతం అవుతుందని చక్రవర్తి సూచించారు.

# రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి

**●సీఎం,మంత్రులు, ఎమ్మెల్యేలతో ఢిల్లీ వెళ్లిన కవ్వంపల్లి...**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్16(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం ఢిల్లీలో వేం నరేందర్ రెడ్డి తో పాటు అభిషేక్ సంఘ్వీ, బీహార్ నుంచి ఎన్నికైన,నితిన్ నబీన్,నితీశ్ కుమార్ తదితరులచే రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తో పాటు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఢిల్లీ వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వేం నరేందర్ రెడ్డి కి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.



# రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

**●రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు: ఏసీపి వస్తుంధర యాదవ్**





**కల్లూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి ఒక్కరు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కల్లూరు ఎసిపి వసుంధర యాదవ అన్నారు. అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమాన్ని పురస్కరించుకుని, కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అంబేద్కర్ ప్రధాన సెంటర్ వద్ద కల్లూరు ఎస్సై హరిత ఆధ్వర్యంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలసి రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ రహదారి భద్రతా చర్యల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయన్నారు. నిర్ణీత వేగ పరిమితిని పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని అన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం, ఓవర్ టేక్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమం కల్లూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, బిరవల్లి మాధవ్, నాయకులు బైర్ల కాంతారావు, కర్నాటి అప్పిరెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నోరులేని పశువులకు అండగా యువ దంపతులు

**● గోశాలకు 100 వరిగడ్డి కట్టల విరాళం**

**● పోట్రు ప్రవీణ్, నవ్య దంపతుల సేవాభావం ప్రశంసనీయం.. గ్రామస్థుల హర్షం**



**కల్లూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామంలో సామాజిక బాధ్యతను ప్రతిబింబించే ఒక స్ఫూర్తిదాయక ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతుల కుమారులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రధాన అనుచరులు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పోట్రు ప్రవీణ్, సతీమణి నవ్య దంపతులు గురువారం శ్రీకృష్ణ గోశాలకు 100 కట్టల వరిగడ్డి వితరణ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. నోరులేని పశువుల సంరక్షణకు గోశాలలు కీలకంగా నిలుస్తున్న నేపథ్యంలో, వాటి పోషణకు అవసరమైన ఆహారాన్ని అందించడం గొప్ప సేవగా భావించబడుతోంది. ఈ దంపతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరిగడ్డి కట్టలను అందించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. గోశాలలో ఉన్న గోవులకు ఆహారం అందించడం ద్వారా జీవదయను ఆచరణలో చూపించినట్లు గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రవీణ్, నవ్య దంపతులు మాట్లాడుతూ, గోశాలకు తమవంతు సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సహాయం చేయాలని వారు పిలుపునిచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఈ దంపతులను అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తి మరింత మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే శ్రీకృష్ణ గోశాల సిబ్బంది ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ, ఇలాంటి దాతృత్వం వల్ల గోశాల నిర్వహణకు ఎంతో తోడ్పాటు లభిస్తుందని చెప్పారు. మానవత్వం, దయ, సేవాభావం కలిసిన ఈ చర్య సమాజంలో సానుకూల మార్పులకు దారి తీసే స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచింది.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**● తల్లాడ మండల క్రైస్తవ ఐక్యవేదిక డిమాండ్ ● 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల రద్దుకు పిలుపు ● సుప్రీంకోర్టు తీర్పుపై ఆందోళన**





**తల్లాడ, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలో దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. తల్లాడ పట్టణం నందు ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ సమావేశానికి నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు బ్రదర్ సంగసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 1950లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వుల వల్ల దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరించబడిందని విమర్శించారు. ఈ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేసి, దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించేలా పార్లమెంటులో చట్టం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. 1956లో సిక్కులకు, 1990లో బౌద్ధులకు ఎస్సీ హోదా విస్తరించినట్లే, దళిత క్రైస్తవులకు కూడా అదే హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మత మార్పిడి ఆధారంగా హక్కులను నిరాకరించడం వివక్షకరమని పేర్కొన్నారు. ఇతర వర్గాలు చర్చిలకు వెళ్లినా రిజర్వేషన్లు రద్దు కాకపోయినా, ఎస్సీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించగానే హక్కులు కోల్పోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న నేతలు క్రైస్తవ సంఘాలు అన్నీ ఒకే వేదికపైకి వచ్చి దళిత హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాలను మరింత బలపరచాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో టిసిసి రాష్ట్ర కోశాధికారి రెవ. మేకల ప్రసాదరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఏఐసిసి కన్వీనర్ రెవ. కెనడీ రాజ్, జిల్లా నాయకులు రెవ. బాబురావు, బ్రదర్ ఇసనపల్లి శ్రీనివాసరావు, పాస్టర్ డానియల్, సాల్మన్ రాజ్, కె.వి. ఇశ్రాయేలు, రెవ. బిషప్ దారెల్లి తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల దందా బహిర్గతం!

**• మానసపల్లి (12వ వార్డు)లో స్కూల్ పేరుతో బహుళ అంతస్తుల నిర్మాణం • చట్టాలను తుంగలో తొక్కిన అధికారులు? ప్రజల్లో ఆగ్రహం**

**ములుగు జిల్లా, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మానసపల్లి పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం సంచలనంగా మారింది. ముఖ్యంగా 12వ వార్డు పరిధిలో, సమీపంలో "స్కూల్" పేరుతో భారీ బహుళ అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులను కాపాడాల్సిన అధికారులు తాము కాపాడాల్సిన చట్టాలను పక్కనబెట్టి అక్రమాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిరిజనేతరులు కమర్షియల్ ప్రయోజనాల కోసం భారీ భవనాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు మౌనం వహించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.స్థానికుల ఆరోపణల ప్రకారం, అనుమతుల పేరుతో లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని గిరిజనేతరులకు అధికారులు అండగా నిలుస్తున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మరియు 1/70 చట్టాలకు




విరుద్ధంగా ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.గిరిజన ప్రాంతాల్లో భూములు గిరిజనేతరులకు బదిలీ చేయరాదన్న స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ అవి పూర్తిగా పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటేనోటీసులు ఇచ్చిన తరువాత కూడా నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భవనం సున్నం, పెయింటింగ్ దశకు చేరుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణగా మారింది."మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏం చేస్తారు లే" అనే ధీమాతో నిర్మాణాలు సాగుతున్నాయని స్థానికులు



విమర్శిస్తున్నారు. ఒకవైపు స్కూల్ పేరుతో అనుమతులు తీసుకుని, మరోవైపు కమర్షియల్ నిర్మాణంగా మార్చుతున్నారని ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై గిరిజన సంఘాలు, స్థానిక ప్రజలు తీవ్రంగా స్పందిస్తూ వెంటనే నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఐదవ షెడ్యూల్, 1/70 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, గిరిజన హక్కులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలపై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం...



**కరీంనగర్,ఏప్రిల్16(పీసీడబ్ల్యూ న్యూస్):**కరినగర్ నగరంలో కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని,




హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం, ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశం, ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్ధన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సేవికాసమితి ప్రాంత శారీరక్ ప్రముక్ లెక్కల రమ మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. అనంతరం. ముఖ్యఅతిథిగా హాజరైన మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి, గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు, ఎన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య, ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు, బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్ నల్లాల బుచ్చిరెడ్డి

**హనుమకొండ ఏప్రిల్16(పీసీడబ్ల్యూ న్యూస్):**జర్నలిస్టుల సంక్షేమం మరియు వృత్తిపరమైన గుర్తింపులో కీలకమైన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్ నల్లాల బుచ్చిరెడ్డి నియమితులయ్యారు. గత 24 సంవత్సరాలుగా పత్రికా రంగంలో అలుపెరుగని ప్రయాణం చేస్తున్న ఆయన అనుభవాన్ని గుర్తించిన ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీలో ఆయనకు చోటు కల్పించింది. ప్రస్తుతం 'ప్రజా తంత్ర' దినపత్రికలో పనిచేస్తున్న బుచ్చిరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా పేరుపొందారు. 2004 నుండి ప్రింట్ మీడియాలో కొనసాగుతూ, అనేక సామాజిక అంశాలపై నిశితమైన విశ్లేషణలు అందించారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు (అక్రిడిటేషన్) మంజూరు చేయడంలో ఈ కమిటీ పాత్ర అత్యంత కీలకం. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులను గుర్తించడం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం. జర్నలిస్టుల సంక్షేమం మీడియా ప్రతినిధుల హక్కులు, సౌకర్యాల విషయంలో కమిటీ నిర్ణయాలు తీసుకోవడం. రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న బుచ్చిరెడ్డి వంటి సీనియర్ జర్నలిస్ట్‌ను కమిటీలోకి తీసుకోవడం పట్ల హన్మకొండ జిల్లా పాత్రికేయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి తెలిపారు. ఆయన నియామకం పట్ల పలువురు ఎడిటర్లు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.



# దళిత రత్న పురస్కారం అందుకున్న కొరపాక అంజి మాదిగ

**డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో గౌరవం**

**సామాజిక సేవలకు గుర్తింపుగా పురస్కారం అందించిన ఉత్సవాల కమిటీ**

**ఉప్పల్, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత రత్న పురస్కారాల కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొరపాక అంజి మాదిగ దళిత రత్న పురస్కారం అందుకున్నారు.ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో



నడుస్తూ ఉద్యమంలో కట్టుబడి పనిచేస్తూ, సామాజిక సేవలో ముందుండి సేవలందిస్తున్నందుకు ఈ పురస్కారం లభించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేయడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన ప్రయాణాన్ని గుర్తించి, మహనీయుల జయంతులు, వర్థంతుల సందర్భంగా అన్ని విధాల సహకరిస్తూ దళిత బహుజన పేద వర్గాల కుటుంబాలకు అండగా నిలిచినందుకు ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా దళిత రత్న పురస్కారాన్ని అందజేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్.వై. అశోక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో మరింతగా కృషి చేస్తానని కొరపాక అంజి మాదిగ పేర్కొన్నారు.

# ఏటూరునాగారంల్లో ఇసుక మాఫియా !

**• మేజర్ గ్రామపంచాయతీలో రోడ్లు ధ్వంసం అధికారుల మౌనం పై తీవ్ర విమర్శలు**



**ఏటూరునాగారం,ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం ల్లో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకు విస్తరిస్తూ, నియంత్రణ లేకుండా కొనసాగుతుండటం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ముఖ్యంగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది.స్మశాన వాటికకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాబోయే వర్షాకాలంలో ఈ రహదారి పూర్తిగా దుర్భరంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటిక వరకు "వైకుంఠ రథం" కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని ప్రజలు చెబుతున్నారు.**రాత్రివేళల్లో ఇసుక దందా జోరు** స్థానికుల సమాచారం ప్రకారం, రాత్రివేళల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా నదులు, వాగుల నుంచి భారీగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇసుక తరలింపును ఫొటోలు తీసిన విలేకరులను బెదిరిస్తూ, "డీడీలు తీసుకున్నాంఢ ఆన్లైన్‌లో బుక్ చేసుకున్నాం" అంటూ సమాధానాలు ఇస్తున్నారని ఆరోపణలు

## కరీంనగర్‌జగిత్యాల NH 563 పనులు వేగవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం, కరీంనగర్‌జగిత్యాల జాతీయ రహదారి NH 563 విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పనుల పురోగతిని వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలను కలిపే ఈ కీలక రహదారి పూర్తయితే కరీంనగర్, జగిత్యాల మరియు పరిసర ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వాణిజ్యం, వ్యవసాయ రంగాలకు ఊతమిస్తుందని ఎమ్మెల్యే వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి బండి సంజయ్, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేసే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి & ఈ) డైరీ ఆవిష్కరణకు పరమేశ్వర్ రెడ్డికి ఆహ్వానం



**ఉప్పల్, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (పి &ఈ ) డైరీ ఆవిష్కరణ ఈనెల 19వ తేదీన ఉప్పల్ భగాయత్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రెస్ క్లబ్(పి &ఈ ) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి కి బుధవారం ఉదయం ఆయన నివాసంలో కలిసి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉప్పల్ చరిత్రలో మొదటిసారిగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) ఏర్పడి డైరీ తీయడం అభినందనీయమన్నారు. మీ క్లబ్బుకు అన్ని వర్గాల మద్దతు ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- ఏప్రిల్ 25 వరకు దరఖాస్తుల స్వీకరణ
- టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ జె సి సెట్2026కు ఆన్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభం
- విద్యార్థులకు పిలుపు ● కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ




**కల్లూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి గాను జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ జె సి సెట్2026 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభమై, ఏప్రిల్ 25 వరకు స్వీకరించబడతాయని టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఎస్ / జెసి (గర్ల్స్) కల్లూరు ప్రిన్సిపల్ పి. కనకదుర్గ ఒక ప్రకటనలో తెలిపారు.రెగ్యులర్ ప్రాతిపదికన 202526 విద్యా సంవత్సరంలో ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ ద్వారా పదవ తరగతి పూర్తి చేసినవారు లేదా 2026 మార్చిలో ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు. ఈ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక కోచింగ్ సదుపాయాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఐఐటీ, జేఈఈ, నీట్, సీఎంఏ, ఈఏపీసెట్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. అదేవిధంగా సైనిక కళాశాలల ప్రవేశాలకు (ఎన్‌డీఏ, ఐఐటీ) అవసరమైన శిక్షణ కూడా అందిస్తారు. అంతేకాకుండా సాధారణ జూనియర్ కళాశాలల్లో MPC, BPC, MEC, CEC, HEC గ్రూపుల్లో కూడా ప్రవేశం పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి లేదా సమీపంలోని టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ కళాశాలను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని ప్రిన్సిపల్ పి. కనకదుర్గ సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ ఎప్పుడు.?

## జర్నలిస్టులకు రక్షణ ఏది.?

## దాడులు, బెదిరింపులు పెరుగుతున్న వేళ చట్టం కోసం టీజేఎస్ఎస్ డిమాండ్

## తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజేఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ

**హైదరాబాద్ ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరమని టీజేఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం నిత్యం శ్రమించే ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణించే మీడియా ప్రతినిధులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. **ఎవరు పడితే వారు దాడులకు దిగుతున్నారన్న ఆందోళన** రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు, గల్లీ స్థాయి నాయకులు, వారి అనుచరులు ఇలా ఎవరు పడితే వారు జర్నలిస్టులపై దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారని గౌటి రామకృష్ణ విమర్శించారు. వాస్తవాలు రాస్తున్నందుకు, అవినీతి, అక్రమాలు వెలికితీస్తున్నందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. **ఆధారాలు లేకుండా కేసులు, పోలీసుల వైఖరి మారాలి** చాలా సందర్భాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండానే జర్నలిస్టులపై కేసులు నమోదు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖ కూడా వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఫిర్యాదు చేశారన్న నేపంతో ముందుగా జర్నలిస్టులపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకుల, అధికారుల ఒత్తిడికి పోలీసులు లోనై నిర్దోషులైన జర్నలిస్టులను జైలుకు పంపించడం ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. **శఫోర్త్ ఎస్టేట్ విలువ కావాలని తగ్గిస్తున్నారా.?** ప్రజల సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా విలువను కొందరు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన రంగంలో పనిచేసే జర్నలిస్టులకే రక్షణ లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరించారు. అందుకోసమే**"జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరం అన్నారు.** జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు అరికట్టాలంటే ప్రత్యేక చట్టం అవసరమని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు. జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి వస్తేనే మీడియా ప్రతినిధులు భయంలేకుండా పని చేయగలరని అన్నారు. ఈ చట్టం ద్వారా దాడులకు, బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. **అందరూ ఏకతాటిపైకి రావాలి** జర్నలిస్టులు సంఘాలకు అతీతంగా ప్రతి జర్నలిస్టు, ప్రతి సంఘ నాయకుడు ఒకే వేదికపైకి రావాలని గౌటి రామకృష్ణ పిలుపునిచ్చారు. "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" సాధన కోసం సమిష్టిగా పోరాడితేనే ఫలితం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల రక్షణ కోసం చట్టం తీసుకురాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రత కోసం పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు.



# మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నిత్యావసర సరుకుల పంపిణీ

- సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ సేవా కార్యక్రమం
- సిబ్బందికి భద్రతా పరికరాలు అందజేత




**కల్లూరు, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి నిత్యావసర సరుకులు, భద్రతా పరికరాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సిబ్బందికి అవసరమైన సరుకులను స్వయంగా అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బందికి నిత్యావసర సరుకులతో పాటు సేఫ్టీ గ్లౌజులు, రిఫ్లై రాకెట్లు వంటి భద్రతా పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వారికీ అవసరమైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, మున్సిపల్ మేనేజర్ నాగేశ్వరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ భాస్కర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బీరెల్లి మాధవరావు, దాసరి సుధారాణి, ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, ఏఎంసి మాజీ డైరెక్టర్ సీనియర్ నాయకులు పెద్దబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కనకపుడి వీరస్వామికి దళితరత్న అవార్డు

## -రవీంద్రభారతిలో ఘన సత్కారం
## - బడుగు బలహీన వర్గాలకోసం చేసిన నిరంతర పోరాటం
## - దళితరత్న అవార్డుతో సమాజంపై మరింత బాధ్యత
## - కనకపుడి వీరస్వామి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో సేవలందిస్తున్న కనకపుడి వీరస్వామి కి దళితరత్న అవార్డు వరించింది. హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన కనకపుడి వీరస్వామి కి గురువారం ప్రతిష్టాత్మక "దళితరత్న" అవార్డును ప్రధానం చేశారు. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ కో-కన్వీనర్ శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవార్డుల ప్రధానోత్సవంలో కమిటీ సభ్యులు తెలంగాణ మాదిగ హక్కుల వ్యవస్థాపకులు, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పాల్గొని ఈ అవార్డును అందజేశారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో సేవలందిస్తున్నందుకు గాను కనకపుడి వీరస్వామి ని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాలకు కనకపుడి వీరస్వామి చేస్తున్నసేవ అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీత కనకపుడి వీరస్వామి మాట్లాడుతూ... తాను చేసిన సేవలను గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు.

# ఈనెల 19న ఉప్పల్ ప్రెస్‌క్లబ్ (పి అండ్ ఈ)డైరీ ఆవిష్కరణ

- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు..ఏసీపీ వెంకట్ రెడ్డికి ఆహ్వానం
- వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో శ్రీరస్తు కన్వెన్షన్ లో వేడుక



**ఉప్పల్ ఏప్రిల్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (పి అండ్ ఈ) 2026-27 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది.ఈ నెల 19వ తేదీన ఉప్పల్ భగాయత్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి మల్కాజ్గిరి ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. **ఏసీపీకి సాదర ఆహ్వానం** గురువారం ప్రెస్ క్లబ్ (పి అండ్ ఈ) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఏసీపీ వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు డైరీ ఆవిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా కోరారు.ఇందుకు ఏసీపీ సానుకూలంగా స్పందిస్తూ, సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.పాత్రికేయుల సంక్షేమం, ఐక్యతను చాటిచెప్పే విధంగా ఈ డైరీని రూపొందించినట్లు క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ తెలిపారు.19వ తేదీన జరిగే ఈ వేడుకకు నియోజకవర్గంలోని పాత్రికేయులు,ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# బిజెపి పార్టీతోనే ఏదైనా సాధ్యం: బండి పద్మ



**ఉప్పల్ ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని మరెన్నో సంస్కరణలను తీసుకువచ్చిన ఘనత బిజెపి పార్టీకే దక్కుతుందని మహిళా బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి మహిళలకు సమాన హక్కు కల్పించాలన్న దృఢ సంకల్పంతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకొస్తున్న సంస్కరణలో ఎంతో మార్పు చెందుతుందని ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండి పద్మ అన్నారు. మహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడుతున్న సందర్భంగా బండి పద్మ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ ఎనిమిది వీరరాజా రెడ్డి విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహిం చారు. బిజెపి సీనియర్ మహిళా నాయకురాలు సాదినేని గీత, స్రవంతి, సువర్ణ సిందే, లావణ్య, వీణ,బిజెపి సీనియర్ నాయకులు వెంకన్న గౌడ్, సోమశేఖర్ గౌడ్, జగన్ యాదవ్, ప్రవీణ్, ఎల్లాచారి, రంగా రవిలు పాల్గొన్నారు.




## పదివేల ఆర్థిక సహాయం అందించిన కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్నంల

**రామన్నపేట ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన గంగుల శశికళ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు పదివేల ఆర్థిక సహాయం అందించినారు. మాజీ సర్పంచ్ గంగుల వెంకటరెడ్డి వార్డు మెంబర్స్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సహకార సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత మోటార్ సైకిళ్ల పంపిణీ



**షాద్ నగర్, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సహకార సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత మోటార్ సైకిళ్లను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, చించోడు సర్పంచ్ శ్రీనివాస్ ,ఉప్పరి గడ్డ సర్పంచ్ చందు నాయక్,చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి, రాజు, హైదర్ గోరి పాల్గొనారు.



# కోహ్లీని ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్

క్రికెట్ మైదానంలో పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, ఆటగాళ్ల మధ్య ఉండే గౌరవం ఆటకు అసలైన అందాన్ని తెస్తుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో అటువంటి ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ యువ ప్లేయర్ చేసిన ఒక పని, విరాట్ కోహ్లీని సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీకి విరాట్ కోహ్లీ (49 పరుగులు, 34 బంతులు) అద్భుతమైన పునాది వేశారు. తన క్లాసిక్ షాట్లతో చిన్నస్వామి స్టేడియాన్ని హోరెత్తించిన కోహ్లీ, కేవలం ఒక పరుగు దూరంలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నారు. అయితే, ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్న తర్వాత, మైదానంలో ఆటగాళ్లందరూ ఒకరినొకరు అభినందించుకుంటున్న సమయంలో ఒక విశేషం జరిగింది. లక్నోకు చెందిన ఒక యువ ఫాస్ట్ బౌలర్ (వార్తల ప్రకారం మయాంక్ యాదవ్ లేదా యువ పేసర్ మయుక్ చౌదరి) విరాట్ కోహ్లీ దగ్గరికి వెళ్లి, ఆయన పట్ల ఎంతో వినయాన్ని ప్రదర్శించారు. కోహ్లీని ఒక లెజెండ్‌గా భావించే ఆ యువ బౌలర్, కోహ్లీ దగ్గరికి వచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకున్నట్లుగా ప్రవర్తించడమే కాకుండా, వికెట్ల మధ్య కోహ్లీ వేగం మరియు ఫిట్‌నెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ హఠాత్పరిణామానికి కోహ్లీ కాసేపు ఆశ్చర్యపోయినా, వెంటనే ఆ యువ ఆటగాడిని ఆత్మీయంగా హత్తుకుని మెచ్చుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లీ చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అందుకే ఆయన ఈ మ్యాచ్‌లో 'ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్'గా బరిలోకి దిగారు. ఫీల్డింగ్ చేయకపోయినా, బ్యాటింగ్ సమయంలో ఆయన క్రీజులో పరిగెత్తిన తీరు చూస్తుంటే ఎక్కడా గాయం లక్షణాలు కనిపించలేదు. ఆ యువ బౌలర్ కూడా ఇదే విషయాన్ని కోహ్లీతో చర్చిస్తూ, "మీ ఎనర్జీ లెవల్స్ చూస్తుంటే మాకే ఆశ్చర్యంగా ఉంది" అని అన్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ బౌలర్లు రసిక్ సలాం (4/24), భువనేశ్వర్ కుమార్ (3/27) అద్భుత ప్రదర్శనతో లక్నోను 146 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం కోహ్లీ 49 పరుగులతో మెరవగా, చివర్లో రజత్ పాటిదార్ (27), జితేష్ శర్మ (23) మెరుపులు మెరిపించి ఆర్‌సీబీకి సునాయాస విజయాన్ని అందించారు. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు, తమ రన్ రేట్‌ను భారీగా మెరుగుపరుచుకుని టేబుల్ టాపర్‌గా నిలిచింది.

# వరల్డ్ టైటిల్ రేసులో వైశాలి

చెస్ ప్రపంచంలో భారత యువ కెరటం వైశాలి రమేష్ బాబు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కాండిడేట్స్ టోర్నమెంట్ 2026లో విజేతగా నిలిచి ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం జూ వెన్‌జున్‌తో తలపడే అవకాశాన్ని దక్కించుకుంది. ఆఖరి రౌండ్లో రష్యా క్రీడాకారిణి కటెరినా లగ్నోపై అద్భుత విజయం సాధించిన వైశాలి రమేష్ బాబు.. మొత్తం 14 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీంతో ప్లే-ఆఫ్స్ అవసరం లేకుండానే ఆమెను విజేతగా ప్రకటించారు. టోర్నీ ఆరంభంలో తక్కువ రేటింగ్ కలిగిన క్రీడాకారిణిగా బరిలోకి దిగిన వైశాలి, అసాధారణ ప్రతిభను కనబరిచింది. చివరి రౌండ్ మొదలయ్యే సమయానికి ఆరుగురు క్రీడాకారిణులు రేసులో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే వైశాలి తన ప్రత్యర్థి లగ్నోను తెలివిగా ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన రేటింగ్‌ను 26 పాయింట్ల వరకు పెంచుకోవడమే కాకుండా, తన కెరీర్‌లో అత్యుత్తమ మైలురాయిని చేరుకుంది. మరోవైపు బిబిసార అసౌబాయేవా తన చివరి గేమ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌తో డ్రా చేసుకుని రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఝూ జిన్నర్, అలెగ్జాండ్రా గోర్యాచ్కినా సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. వైశాలి గెలుపుపై భారత చదరంగ




దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. "వైశాలి అద్భుతమైన సన్నద్ధతను, పట్టుదలను ప్రదర్శించింది. కష్టాలను ఎదుర్కొని విజయాన్ని అందుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారతీయులు ఉండటం గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో శిక్షణ పొందిన వైశాలికి ఈ విజయం చాలా ప్రత్యేకం. గతంలో గ్రాండ్ స్విస్ టైటిళ్లను గెలుచుకున్న వైశాలి, ఇప్పుడు ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్ బెల్టుపై కన్నేసింది. చెన్నైకి చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిని మరోసారి ఇనుమడింపజేసింది. రాబోయే టైటిల్ పోరులో ఆమె జూ వెన్‌జున్‌కు గట్టి పోటీనిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# ముకుల్ చౌదరికి కృనాల్ పాండ్యా వార్నింగ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నిన్న బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొంది.. ఐపీఎల్ పాయింట్ల పట్టికలో తొలిస్థానానికి ఎగబాకింది. అయితే ఈ మ్యాచ్ జరుగుతున్న తొలి ఇన్నింగ్స్ అనగా లక్నో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. లక్నో బ్యాటర్ ముకుల్ చౌదరితో ఆర్సీబీ లెగ్ స్పిన్నర్ కృనాల్ పాండ్యా మధ్య వివాదం చెలరేగింది. కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో ముకుల్ చౌదరి ఓ పవర్ ఫుల్ షాట్ కొట్టగా.. అదే సమయంలో వారిద్దరి మధ్య మాటలు జారినట్లు తెలుస్తోంది. అయితే కెమెరాలో ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా కోపంతో అరుస్తున్నట్లు చూపించారు. కానీ, వారిద్దరి మధ్య ఏం జరిగిందనే విషయం తెలియరాలేదు. అయితే పిచ్‌లో ఉండే వికెట్ మైక్స్ వారి మాటలను రికార్డు చేశాయి. బౌండరీ తర్వాత కృనాల్ పాండ్యా స్లెడ్జింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. ముకుల్ చౌదరి మొదట కొట్టిన భారీ షాట్ తర్వాత.. కృనాల్ పాండ్యా ఆ బ్యాటర్‌ను స్లెడ్జింగ్ చేస్తూ, మరోసారి అదే షాక్ ఆడమని సవాలు విసిరాడు. క్రీజ్‌లో మానసిక ఒత్తిడిని కలిగించే ప్రయత్నంలో, పాండ్యా తర్వాతి బంతినే కొట్టమని చౌదరిని స్పష్టంగా సవాలు చేశాడు. అదే విధంగా తన తర్వాతి బాల్‌లో కూడా బౌండరీతో ముకుల్ అలరించాడు. ఆ షాట్ తర్వాత ముకుల్ పాండ్యాతో నేరుగా కళ్ళలోకి చూస్తూ, తాను సవాలును స్వీకరించానని చెప్పాడు. తన తర్వాతి ఓవర్‌లో బ్యాటర్ వికెట్ తీస్తానని పాండ్యా శపథం చేయడంతో ఈ వాగ్వాదం కొనసాగింది. టీ20 క్రికెట్ మ్యాచ్ టెన్షన్ వాతావరణంలో స్లెడ్జింగ్ లేదా ఇరు టీమ్స్ సవాళ్లు సాధరణమైనా.. అయితే అందుకు కొంత హద్దు ఉంది. ప్రస్తుతం వీరిద్దరి వాగ్వాదం ఇప్పుడు ఐపీఎల్ నిర్వహణ అధికారుల వద్దకు చేరింది. క్రికెట్ స్ఫూర్తిని కాపాడేందుకు ఆటగాళ్ల ప్రవర్తన మరియు మైదానంలో దూకుడుకు సంబంధించి ఐపీఎల్ పాలక మండలి కఠినమైన మార్గదర్శకాలను పాటిస్తుంది. పరిస్థితి శారీరక ఘర్షణగా మారకుండా నివారించడానికి, స్టేడియంలో ఉన్న అంపైర్లు ఆటగాళ్లను నిశితంగా గమనిస్తూ కనిపించారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి మ్యాచ్ రిఫరీ నుండి వచ్చే ఏవైనా తదుపరి నివేదికల వల్ల, సంబంధిత ఆటగాళ్లకు జరిమానాలు లేదా అధికారిక హెచ్చరికలు విధించే అవకాశం ఉంది.



# రిషబ్ పంత్ ఎడమ మోచేతికి గాయం

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో ఒక ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. మూడవ ఓవర్‌లోనే ఎయిడెన్ మార్క్రమ్ అవుట్ అవ్వడంతో క్రీజులోకి వచ్చిన పంత్, జోష్ హాజిల్‌వుడ్ వేసిన నాలుగో ఓవర్‌లో ఇబ్బంది పడ్డాడు. హాజిల్‌వుడ్ సంధించిన ఒక షార్ట్ డెలివరీని భారీ షాట్ ఆడబోయిన క్రమంలో బంతి నేరుగా పంత్ ఎడమ మోచేతికి బలంగా తగిలింది. ఆ దెబ్బకు పంత్ విపరీతమైన నొప్పితో మైదానంలోనే విలవిలలాడిపోయాడు. ఫిజియో వచ్చి ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ పంత్ నొప్పి తగ్గలేదు. ఆ బాధ భరించలేక అతను కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది. బ్యాటింగ్ కొనసాగించలేక రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగే ముందు, తన వాచిన మోచేతిని బౌలర్ హాజిల్‌వుడ్‌కు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. పంత్ మైదానాన్ని వీడటంతో లక్నో క్యాంప్‌లో ఆందోళన మొదలైంది. అయితే, తన జట్టు కోసం పంత్ అద్భుతమైన పోరాట పటిమను కనబరిచాడు. 16వ ఓవర్‌లో ఆయుష్ బదోని అవుట్ అయిన తర్వాత, తన ఎడమ చేతికి భారీగా బ్యాండేజ్ కట్టుకుని మళ్ళీ క్రీజులోకి వచ్చాడు. తన ఆరోగ్యం కంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని పంత్ నిరూపించాడు. అయితే ఒక్క పరుగుకే వెనుదిరగడం ఫ్యాన్స్ కు నిరాశ కలిగించినా, అతని ఫైటింగ్ స్పిరిట్ ను అంతా మెచ్చుకుంటున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు లక్నో ఓపెనర్ మిచెల్ మార్ష్ బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ టీ20 క్రికెట్ మారుతున్న తీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



# సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ధోనీ దూరం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ లీగ్‌లో ఏకంగా 5 సార్లు ట్రోఫీ ని గెలుచుకొని..మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీగా నిలిచింది. కానీ, గత రెండు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో మ్యాచ్ గెలిచేందుకే తీవ్రంగా శ్రమిస్తోంది. కొన్ని సందర్భాల్లో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగుభాగన ఉండి ట్రోల్స్ కు గురవుతోంది. అయితే చెన్నై గెలుపులోనూ ధోనీ ఉండగా.. ఇప్పుడు టీమ్‌లో ధోనీ లేకపోవడమే జట్టు వైఫల్యానికి ప్రధాన కారణమని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ సీజన్‌లో గాయం కారణంగా రెండు వారాల పాటు దూరమైన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. లేకపోవడం చెన్నై టీమ్ వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో ధోనీ ఎప్పుడొస్తాడని సీఎస్కే టీమ్ సహా అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే శనివారం ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌లో ధోనీ ఆడబోతున్నాడనే వార్తలు వచ్చాయి. కానీ, ఈ మ్యాచ్‌కు కూడా ధోనీ అందుబాటులో ఉండడం లేదని సమాచారం. సీఎస్కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. ఏప్రిల్ 23న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగే ఐపీఎల్ 2026 మ్యాచ్‌లో అందుబాటులో ఉంటాడని తాజా సమాచారం. పిక్క కండరాల గాయం కారణంగా ఆరంభ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ధోనీ లేకుండా చెన్నై ఆడిన మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 3 ఓటములతో సతమతమవుతోంది. అయితే సీఎస్కే తరువాతి మ్యాచ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఏప్రిల్ 18న జరగనుంది. అయినా కూడా ఏప్రిల్ 23న ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నాడని తెలుస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం.. సీఎస్కే వర్గాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌కు దగ్గరగా ఉన్నాడు. 2011 వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్‌కు అందించిన వాంఖడే మైదానంలో జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలతో సీఎస్కే ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇటీవలే కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో మ్యాచ్‌కు ముందు, ధోనీ సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీతో కలిసి శిక్షణ తీసుకున్నాడు. కానీ, అతను మైదానంలోకి రాలేదు.

# ముంబై ఇండియన్స్‌లోకి క్రిష్ భగత్

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గాయం కారణంగా టోర్నీకి దూరమైన యువ ఆటగాడు అథర్వ అంకోలేకర్ స్థానంలో క్రిష్ భగత్ అనే కొత్త కుర్రాడిని జట్టులోకి తీసుకుంది. సీజన్ ప్రారంభానికి ముందే అంకోలేకర్ మోకాలి గాయంతో తప్పుకోగా, నాలుగు మ్యాచ్‌ల తర్వాత ముంబై మేనేజ్‌మెంట్ ఈ రీప్లేస్‌మెంట్‌ను అధికారికంగా ప్రకటించింది. నేడు పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందే ఈ మార్పు చోటుచేసుకోవడం విశేషం. 21 ఏళ్ల క్రిష్ భగత్ రైట్ హ్యాండ్ ఆల్‌రౌండర్. ఇతడు దేశవాళీ క్రికెట్‌లో పంజాబ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. క్రిష్ ఒక మంచి పేస్ బౌలర్ మాత్రమే కాదు, లోయర్ ఆర్డర్‌లో వచ్చి భారీ షాట్లు ఆడగల సమర్థుడు. గత రెండేళ్లుగా ఇతడు ముంబై ఇండియన్స్ ట్రయల్స్‌లో పాల్గొంటున్నాడు. ఈ ఏడాది జరిగిన డివై పాటిల్ టీ20 కప్‌లో రిలయన్స్ జట్టు తరపున ఆడి తన ప్రతిభను చాటుకున్నాడు. క్రిష్ భగత్ ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం నుంచి ముంబై ఇండియన్స్ జట్టుతో ఒక సపోర్ట్ బౌలర్‌గా ప్రయాణిస్తున్నాడు. ప్రాక్టీస్ సెషన్లలో, ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో ఇతడు వేసిన బంతులకు కోచింగ్ స్టాఫ్ ఫిదా అయిపోయారు. "క్రిష్ చూపించిన అంకితభావం, కష్టపడే తత్వం మమ్మల్ని ఆకట్టుకున్నాయి. అందుకే అతడిని ప్రధాన జట్టులోకి తీసుకున్నాం" అని ముంబై ఇండియన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.




# మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు

## రమేశ్‌బాబు తనయుడు తెరంగేట్రం

## జయకృష్ణ హీరోగా శ్రీనివాసమంగాపురం

మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు అంటున్నాడు శ్రీను. ఎంతగానో ప్రేమించిన మంగ తనది కాదు అని తెలిసిన క్షణం శ్రీను ఏ నిర్ణయం తీసుకున్నాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరురుడ రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకుడు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'ఈ క్షణం ఇప్పటికిప్పుడు నీకేమనిపిస్తుంది... నేనస్సలు నీ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నానా?' అంటూ కథానాయకుడు అడగ్గా, టాప్ టెన్‌లో ఉంటావులే... అంటూ కథానాయిక ఇచ్చే సమాధానంతో టీజర్ మొదలవుతుంది. శ్రీను, మంగా అనే యువ జంట చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. 'అందమైన జంట, ఆకట్టుకునే ప్రేమకథ, హత్తుకునే భావోద్వేగాలు, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కుతోన్న చిత్రమిది. తిరుపతి నేపథ్యం సినిమాకి మరింత కొత్తదనాన్ని తీసుకొచ్చింద'ని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుళ్లపాటి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్.




# వరుణ్ తేజ్ మోకాలికి శస్త్రచికిత్స...

## పవన్ కల్యాణ్ స్పందన



యువ హీరో వరుణ్ తేజ్ త్వరగా కోలుకోవాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. 'బరి' సినిమా కోసం ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ తీవ్రంగా గాయపడగా ఆయన మోకాలికి శస్త్రచికిత్స జరగడం తెలిసిందే. దీనిపై పవన్ స్పందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు."యువ కథానాయకుడు వరుణ్ తేజ్ 'బరి' చిత్రం కోసం ప్రాక్టీస్ చేస్తుండగా గాయపడి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారని తెలిసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. వైద్యులు, ఫిజియోథెరపిస్టుల సలహాలు పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ కెమెరా ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రస్తుతం వరుణ్ తేజ్ వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు.





# స్వయంభూ నుంచి రారా ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.

# సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ..ఏక్‌దిన్

స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.





# తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారంటూ తమన్నా పిటిషన్.. కొట్టివేసిన హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై ప్రముఖ సినీ నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2009 అక్టోబర్ వరకు తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఉంది.అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010-2011 మధ్య ఈ సంస్థ తన ఫొటోలను అనుమతి లేకపోయినప్పటికీ ఉపయోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకు గాను తనకు రూ.1 కోటి పరిహారం నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇందుకు సంబంధించి సాక్ష్యాలు చూపలేదంటూ కోర్టు తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది.



# సింగరేణి నేపథ్యంలో సంయుక్త తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్'




టాలీవుడ్ 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్ తన తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్' షూటింగ్‌లో ఎదురైన సవాళ్లను వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. సినిమా తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, దాని వెనుక చిత్ర యూనిట్ పడే శ్రమ ఎంతటిదో ఆమె పెట్టిన పోస్ట్ నిరూపిస్తోంది.

సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మంచిర్యాలలో షూటింగ్ నిర్వహించింది. అక్కడ 40 నుంచి 45 డిగ్రీల తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య పనిచేయడం తమను శారీరకంగా, మానసికంగా పరీక్షించిందని సంయుక్త పేర్కొంది. మండుతున్న ఎండలు, తీవ్రమైన అలసట వేధించినప్పటికీ చిత్ర బృందం ఎక్కడా వెనకడుగు వేయకుండా పనిచేసిందని ఆమె కితాబునిచ్చింది. డీహైడ్రేషన్ బారిన పడకుండా తన పర్సనల్ టీమ్ (నిహారిక, పార్థు) తీసుకున్న జాగ్రత్తలు, దర్శకుడు యోగి అందించిన ప్రోత్సాహం వల్లే ఈ కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేయగలిగానని తెలిపింది.మంచిర్యాల షెడ్యూల్ ముగిసిన వెంటనే సంయుక్త నేరుగా తిరుమలకు చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఆమె, ఆ ప్రశాంతతలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎంతటి ఒత్తిడిలో షూటింగ్ ప్రారంభించానో, అంతే ఉత్సాహంతో తిరిగి వస్తున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

# సందీప్ కిషన్ ...పవర్‌పేట

'పవర్ పేట'సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కనుంది. సందీప్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే ఈ చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఓ ప్రియా ప్రియా, చిన్నదాన నీకోసం (ఇష్క్), గుండెజారి గల్లంతయ్యిందే తదితర హిట్ పాటలను రాసిన కృష్ణ చైతన్య 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తర్వాత 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్ పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్‌సేన్ పేరు తెర పైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్‌మెంట్ వచ్చింది.

